వలంటీర్ల సేవలకు సలాం

- పథకాల పంపిణీలో నిబద్ధత
- లబ్ధిదారులు ఎక్కడున్నా సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ల అందజేత



వృద్ధాశ్రమంలో వృద్ధురాలితో వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ హరీష్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ అరుణకుమారి

మల్కాపురం: ప్రజా సేవే పరమావధిగా భావించి వార్డు వలంటీర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. జీతం కాదు.. ప్రజలకు సాయం చేయడమే ఆశయంగా పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయం–వలంటీర్ వ్యవస్థ ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చింది. సంక్షేమ పథకాలను, ఎన్నో సేవలను వారికి నేరుగా అందజేస్తోంది. ఈ ప్రక్రియలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో నిబద్ధతను కనబరుస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే సూర్యుడు ఉదయించక ముందే లబ్ధిదారుల తలుపు తట్టి పెన్షన్ సొమ్ము వారి చేతుల్లో పెడుతున్నారు. పింఛన్‌దారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో లబ్ధిదారులెవరైనా ఇంటి వద్ద లేకుంటే.. ఎక్కడున్నారో కనుక్కుని సుదూర ప్రాంతాలకు సైతం సొంత ఖర్చులతో వలంటీర్లు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు, ఆశ్రమాలు, సొంతూళ్లు, బంధువుల ఇళ్లలో ఉంటున్న వారి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఎటువంటి నిర్లక్ష్యానికి.. ఆలస్యానికి తావు లేకుండా వలంటీర్లు సేవాదృక్పథంతో పనిచేస్తున్నారు. ఇలా అనేక కార్యక్రమాలతో ప్రజలందరి మన్ననలు పొందుతూ తమ సేవలకు గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇవన్నీ చూసి తట్టుకోలేని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వంటి వారు ప్రజా సేవకులైన వలంటీర్లపై లేని పోని ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అభాసుపాలవుతున్నారు. తమను విమర్శించే ముందు ప్రజలకు తాము నిస్వార్థంగా అందిస్తున్న సేవలను ఒక్కసారి గుర్తుచేసుకోవాలని ప్రతిపక్షాలకు వలంటీర్లు సూచిస్తున్నారు.

లబ్ధిదారుల వద్దకే పింఛన్

- జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హరిజన వీధికి చెందిన ఓ మహిళ కొద్ది రోజులుగా నగరంలోని సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధికి సంబంధించి చికిత్స పొందుతోంది. పింఛన్ లబ్ధిదారైన ఆమె వద్దకు హరిజన వీధి 330 సచివాలయానికి చెందిన వలంటీర్ అరుణకుమారి ఈ నెల ఒకటో తేదీ తెల్లవారు 7 గంటలకు వెళ్లి పెన్షన్ సొమ్ము అందించింది.
- 61వ వార్డు మల్కాపురానికి చెందిన ఓ వృద్ధురాలు నగరంలోని వృద్ధాశ్రమంలో ఉంటోంది. మల్కాపురం 333 సచివాలయం వలంటీర్ హరీష్ మూడు నెలలుగా ఆమె వద్దకు వెళ్లి సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ అందిస్తున్నాడు.
- మల్కాపురం గాంధీజీ వీధికి చెందిన వి.దేవుడమ్మ అనే మహిళ విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గాంధీజీ వీధి సచివాలయం వలంటీర్ నరేష్ ఈ నెల 1న సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్ము అందించాడు. ఇలా చెప్పుకుంటే పోతే వలంటీర్లు అనేక సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

క్లుప్తంగా

మల్కాపురం కొత్త సీఐగా జి.డి.బాబు



సీఐ జి.డి.బాబును కలిసిన కార్పొరేటర్లు నాగేశ్వరరావు, లక్ష్మణరావు

మల్కాపురం: మల్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా జి.డి.బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి సీఐ లూథర్‌బాబు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఈయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పోలీస్ స్టేషన్‌లో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. 40, 62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు సీఐ బాబుకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న పుర్రె సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సుమారు రూ.12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్థానిక నాయకులు సన్యాసిరావు, జిలానీ, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయిబాబా ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, సేవా సంఘం సభ్యులు ఈ కార్యక్రమం చేపట్టారు. గత నాలుగు నెలలతోపాటు ఇటీవల నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల ద్వారా రూ.84 వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవం



స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: ఆషాఢ మాస బహుళ ఏకాదశి సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామి ఆడికృత్తిక మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజుకృష్ణ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామ విభూది పుష్పాలతో అర్చనలు, సర్పదోష, కాల సర్ప, కుజ, రాహు, కేతు, దోష నివారణకు పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం దీపారాధన చేసి సుబ్రహ్మణ్య స్వామిని పల్లకీలో ఊరేగించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



గుడ్డ సంచులు వాడాలని అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గోపాలపట్నం రైతుబజారులో జీవీఎంసీ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెత్త, వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడరాదని రైతు బజారు ఎస్టేట్ అధికారి నారాయణరావు, శానిటరీ అధికారి గోపీ తెలియజేశారు. పాలిథిన్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని వివరించారు. ఈ అంశాలపై కళాకారులు కళాజాత ప్రదర్శించారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల మధ్య తగాదా

తమ్ముడికి గాయాలు

మర్రిపాలెం: ఇద్దరు అన్నదమ్ముల మధ్య వివాదంలో తమ్ముడు గాయపడ్డాడు. కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కప్పరాడలో అన్నదమ్ములు సోమేష్, నాగరాజు తల్లితో కలిసి నివసిస్తున్నారు. వీరిద్దరికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన తర్వాత ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తల్లి ఇద్దరినీ మందలించడంతో ఆ సమయానికి వారు నిద్రపోయారు. గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో ఇద్దరూ కలిసి సమీప దుర్గానగర్‌లోని ఓ బార్‌కు వెళ్లి మద్యం తాగి ఇంటికొచ్చారు. రాత్రి జరిగిన గొడవను తవ్వుకున్నారు. మద్యం మత్తులో ఉన్న అన్నయ్య సోమేష్.. తన తమ్ముడు నాగరాజు తలపై గ్రైండర్‌తో కొట్టి గాయపరిచాడు. నాగరాజు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయ్ కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

40వ వార్డు సమస్యలపై మేయర్‌కు వినతి



మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు కోరారు. ఈమేరకు గురువారం మేయర్‌ను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మేయర్ హామీ ఇచ్చినట్లు నాగేశ్వరరావు తెలిపారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: ఏకాదశి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో అధిష్టింపజేసి ఉభయ దాతలను స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు చేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి, తదితరులు ఈ సేవ నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి, విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈ సేవ నిర్వహించారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు సత్కారం



బదిలీ అయిన టీచర్లను సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఇటీవల జరిగిన బదిలీల్లో వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వారికి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించారు. విద్యార్థుల కేరింతల మధ్య ఈ కార్యక్రమం సందడిగా జరిగింది.

దుర్గాపురంలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



స్క్రీనింగ్ పరీక్షల్లో పాల్గొన్న స్థానికులు

గోపాలపట్నం: దుర్గాపురంలో గురువారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని రోటరీ క్లబ్, మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, వైఎంసీఏ సంయుక్తంగా గ్రామస్తుల సహకారంతో నిర్వహించారు. దుర్గాపురంలో పలువురికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యుడు సుబ్బారావు, వైఎంసీఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ లెనోరా మోహన్, డాక్టర్ విలియమ్స్, శామ్యూల్ విక్టర్, వైద్యులు డాక్టర్ సుభద్ర, డాక్టర్ బంటిన, దుర్గాపురం వాసులు హేమలత, గుణేశ్వరరావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా ఏకాదశి తిరువీధి



మదనగోపాలస్వామికి తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



మదన గోపాలస్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం : ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై మదన గోపాలస్వామికి గురువారం విశేషంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో వేంజేపచేశారు. సింహగిరి మాడవీధుల్లో సాయంత్రం తిరువీధి విశేషంగా నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పారాయణదారులు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎం.నవ్య అనే యువతి తల్లిదండ్రులతో కలిసి కైలాసపురంలో నివసిస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఓ స్వీట్ షాపులో పనిచేస్తోంది. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు షాపునకు బయలుదేరి వెళ్లి తిరిగి రాత్రి 10 గంటలైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో తండ్రి ఎం.అప్పన్నబాబు గురువారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణకుమారి కేసు దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ వేలం వాయిదా

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 5వ జోన్ జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 14న కాన్వెంట్ జంక్షన్ వద్ద గల ఐఓసీఎల్ పెట్రోల్ బంక్ స్థలం వేలం నిర్వహించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. వేలం ఎప్పుడు నిర్వహించేది త్వరలో పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామని, పూర్తి సమాచారం కోసం జోన్–5 జోనల్ కార్యాలయ పర్యవేక్షకులను పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతో కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా చేస్తామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 882వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, నిరసన తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఏడుగురు విద్యార్థుల ఎంపిక

- గోపాలపట్నం జెడ్పీ బాలుర పాఠశాల నుంచి నలుగురు
- బాలికల పాఠశాల నుంచి ముగ్గురికి సీట్లు



ఆర్.శ్రీనివాస్



వి.మదన్



ఎ.విశ్వనాథ్



జి. హరికృష్ణ



జి.జాహ్నవి



ఆర్.గౌతమి



ఇ.ధనశ్రీ

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర, బాలికల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు దక్కించుకున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ఆర్జీయూకేటీకి ఎంపికయ్యారు.

బాలుర పాఠశాల నుంచి.. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర పాఠశాల నుంచి రాయబోని శ్రీనివాస్, అనకాపల్లి విశ్వనాథ్ నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. గొర్లె హరి కృష్ణ, వాకముళ్ల మదన్‌లకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయి. వీరిని ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయుడు బాబూరావు తదితరులు అభినందించారు.

బాలికల పాఠశాల నుంచి.. బాలికల పాఠశాలలో ఇ.ధనశ్రీ , జి.జాహ్నవి, ఆర్.గౌతమిలకు నూజివీడు, శ్రీకాకుళం ఐఐఐటీల్లో సీట్లు వచ్చాయని హెచ్ఎం హెప్సిబా తెలిపారు. వారిని ఆమె ఫోన్‌లో అభినందించారు.

'వలంటీర్లంటే పవన్‌కు చిన్నచూపు'



మాట్లాడుతున్న మళ్ల ధనలత

మల్కాపురం: సచివాలయం–వలంటీర్ వ్యవస్థపై, ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తప్పుడు ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ మళ్ల ధనలత మండిపడ్డారు. 60వ వార్డు శ్రీహరిపురంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వలంటీర్ల విషయంలో పవన్ తీరును తప్పుబట్టారు. వలంటీర్లంటే జనసేనానికి చిన్నచూపన్నారు. వలంటరీ వ్యవస్థ ఉంది కనుకే పైసా ఖర్చు లేకుండా అర్హులైన వారి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో మహిళలు అదృశ్యమయ్యేవారని, దీనిపై ఆయనను ఎందుకు ప్రశ్నించలేదో చెప్పాలని పవన్‌ను ఉద్దేశించి అన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి



ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో డాక్టర్ శశిప్రభ

కంచరపాలెం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నియంత్రించాలని జిల్లా ఎన్జీవోస్ ఫోరం అధ్యక్షురాలు డాక్టర్ శశిప్రభ పిలుపునిచ్చారు. సీఫా ఎన్జీవో, ఎస్‌బీసీసీ సంస్థలు సంయుక్తంగా గురువారం కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణ, రహదారి భద్రత, ఎకో వైజాగ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేయాలన్నారు. ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా జీవించాలని, ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. మరో అతిథి కంచరపాలెం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఆదిరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు, అన్నదమ్ములకు ట్రాఫిక్ నిబంధనలను వివరించి అవి పాటించేలా చూడాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని ప్రతి రోజు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయమాలిని, సచివాలయ సిబ్బంది శ్రీలక్ష్మి, రమణి, తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

సీఈ యూనియన్ విజయం



ఎన్ఏడీ సీఈ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో గెలుపొందిన సీఈ యూనియన్ ప్యానల్ సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ ఎంప్లాయిస్(ఎన్ఏడీ సీఈ) కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో ఎన్ఏడీ సీఈ యూనియన్ బలపరిచిన ప్యానల్ సభ్యులు అత్యధికంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు బుధవారం జరిగాయి. రాత్రి వాటి ఫలితాలు విడుదలయ్యాయి. దీంతో ఎన్ఏడీ కాలనీలో సంబరాలు నిర్వహించారు. సీఈ యూనియన్ బలపరిచిన ప్యానల్ సభ్యులు కె.సూరిరెడ్డి, కె.అప్పలరాజు, కె.నారాయణరావు, కె.సూర్యనారాయణ, జి.మత్స్యరాజు, డి.శివ, వీటీఆర్ శ్రీను గెలిచారు. ఐఎన్‌టీయూసీ బలపరిచిన ఇద్దరు అభ్యర్థులు విజయం సాధించారు. గెలిచిన సభ్యులను ఎన్ఏడీ కాలనీలో ఊరేగిస్తూ సంబరాలు జరుపుకున్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



రాజీవ్‌నగర్‌లో నిబంధనలను అతిక్రమించి కట్టిన నిర్మాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కూర్మన్నపాలెం: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై జీవీఎంసీ అధికారులు ఉక్కుపాదం మోపారు. జీవీఎంసీ 86, 87 వార్డుల పరిధిలోని నాలుగు భవనాలు నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మిస్తున్నారని కొద్ది రోజులుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ఏసీపీ మహాపాత్రో పరిశీలించి, నిబంధనలు అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేశారు. జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొమర్రాజు రచనలు స్ఫూర్తిదాయకం

ఆరిలోవ: తెలుగు భాషా సాహిత్యవేత్త కొమర్రాజు వెంకటలక్ష్మణరావు శత వర్ధంతి కార్యక్రమం గురువారం ఏయూలో తెలుగు విభాగంలో జరిగింది. ఈ సందర్భంగా కొమర్రాజు చిత్ర పటానికి అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కొమర్రాజు మనవడు, ఏయూ రాజనీతి శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు కొమర్రాజు రవి మాట్లాడుతూ భాష, సాహిత్యం తదితర వాటి చరిత్ర పరిశోధనలకు మాత్రమే కొమర్రాజు వెంకటలక్ష్మణరావు పరిమితం కాలేదన్నారు. ఆయన స్త్రీ విద్య కోసం కూడా పాటుపడ్డారని గుర్తు చేశారు. అప్పటి సమాజంలో స్త్రీలు అందరూ చదువుకోవాలని వెంకట లక్ష్మణరావు ఆకాంక్షించారన్నారు. దీంతో పాటు నిమ్న, బడుగు, అట్టడుగు వర్గాల ప్రజలు, వితంతువులు అభ్యున్నతి కోసం రచనలు చేశారన్నారు. బీవీకే కళాశాల తెలుగు విశ్రాంత ఆచార్యుడు దామెర వెంకట సూర్యారావు మాట్లాడుతూ కొమర్రాజు చిన్నప్పటి నుంచే సమాజం పోకడలను గుర్తించారన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజాన్ని మేల్కొలిపే రచనలు చేశారని కొనియాడారు. ముసలి మొగుడు, పడుచు పెళ్లాం, తదితర కథలు రాసి సమాజాన్ని జాగృతపరిచారన్నారు. కొమర్రాజు జీవితాన్ని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏయూ తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్, తెలుగు ఆచార్యులు అన్నంశెట్టి ఈశ్వరమ్మ, బూసి వెంకటస్వామి, కె.రత్నశేఖర్, పి.లావణ్య, ఎ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.